క్లుప్తంగా

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఫాతెహాలు



స్వామి వారి సమాధి

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పెద్దకడబూరు: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి దస్తగిరి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌ను గురువారం ఆయన శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుభ్రమైన నీటిని ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

మంత్రాలయం: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బూదూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనంను వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అదే గ్రామంలో ఓటీఎస్ పథకం కింద డబ్బులు చెల్లించిన వారికి జగనన్న శాశ్వత గృహ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జక్కయ్య నూతనంగా నిర్మించిన ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వై.సీతారామిరెడ్డికి గజమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రభావతి, పీఆర్ ఏఈ నరసింహులు, ఏపీఓ తిమ్మారెడ్డి, ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, ఏఓ జీరాగణేష్, నాయకులు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

కౌతాళం: కౌతాళం ఎంపీడీఓగా విజయ్‌శేఖర్, ఈఓపీఆర్‌డీగా చంద్రమౌళేశ్వర గౌడ్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌శేఖర్ మాట్లాడుతూ.. మండల పరిషత్ అధికారులతో కలిసికట్టుగా పని చేసి అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు. ఈఓఆర్‌డీగా బాధ్యతలు తీసుకున్న చంద్రమౌళేశ్వర గౌడ్ మాట్లాడుతూ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు చెప్పి పంచాయితీల్లో ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా చూస్తానన్నారు. ఇప్పటివరకు కౌతాళం ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడే ఏఓ పనిచేస్తారు. ఆదోని ఎంపీడీఓ ఆఫీసులో పనిచేస్తున్న విజయ్‌శేఖర్‌ను కౌతాళంకు జిల్లా అధికారులు నియమించారు.

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన రాముడు

ఆదోని అర్బన్: మండలంలోని మదిరె గ్రామానికి చెందిన రాముడు (36) బేల్దారి పని చేస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతిచెందాడు. స్థానికులు ఇస్వి పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాముడు గురువారం బిల్డింగ్‌పై ఎక్కి పని చేస్తుండగా కళ్లు తిరిగి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వి పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించండి

ఆదోని రూరల్: ఎన్నో యేళ్ల చరిత్ర కలిగిన ఆదోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవని ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వహణ అధ్యక్షుడు దిలీప్‌దోకా అన్నారు. ఈ మేరకు గురువారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ..ప్రతిరోజూ లక్షల ఆదాయం ఉన్నా ప్రయాణికులకు సౌకర్యాలు మాత్రం లేవన్నారు. ప్లాట్‌ఫాంలో మరుగుదొడ్లు లేవని, నీటి సౌకర్యం కూడా లేదన్నారు. అలాగే 4వ ప్లాట్‌ఫాంలో షెల్టర్ అంతంత మాత్రంగానే ఉందని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల కొరకు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే బోర్డు మెంబర్‌గా ఎన్నికైన ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకొని రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ఆదోని రూరల్: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం ఆదోనిలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ సిబ్బందిని ఆరా తీశారు. లేఅవుట్‌లో మొత్తం 5,101 ఇళ్లు మంజూరు కాగా అందులో బేస్‌మెంట్ లెవెల్ - 1248, రూఫ్ లెవెల్ - 30, ప్లింత్‌బీమ్- 3,087, ప్లింత్ కాంక్రీట్ లెవెల్ - 82, లెంటిల్ లెవెల్ - 2, ఇంకా మొదలు పెట్టనివి - 702 ఉన్నట్లు హౌసింగ్ సిబ్బంది వివరించారు. ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడంతో పాటు నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తక్కువ ధరకే అందిస్తోందని, హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులను చైతన్యవంతం చేసి ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఆర్థిక సాయం, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం, ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరవుతున్నాయా అనే వివరాలు పరిశీలించి తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. ఇంకా మొదలుకాని బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను స్టేజ్ కన్వర్షన్ చేసేదిశగా లబ్ధిదారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. బేస్‌మెంట్ లెవెల్ నుంచి పూర్తి చేయించే బాధ్యత ఏఈలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, గృహనిర్మాణ శాఖ డీఈ రవికుమార్ వెంట ఉన్నారు.

సబ్ కలెక్టర్ తనిఖీలు

స్థానిక పౌరసరఫరాల గోదాము పాయింట్‌ను గురువారం ఆదోని సబ్ కలెక్టర్ అభి షేక్‌కుమార్ తనిఖీ చేశారు. గోదాములోని రేషన్ సరుకుల నిల్వలు, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు.



ఇళ్ల నిర్మాణాలపై అధికారులను ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ వలిబాషా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెద్ద ఈరన్న (ఫైల్)

నందవరం: గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న (45) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. 6వ తేదీ శనివారం సాయంత్రం ఈరన్నపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గాయపడిన ఈరన్నను చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. 9 రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఇంటి వద్ద కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఆలూరు రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే సంబంధిత ఫర్టిలైజర్, సీడ్స్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ స్పెషన్ ఆఫీసర్ (పత్తికొండ ఏడీఏ) విజయ్‌మోహన్ హెచ్చరించారు. ఆయన గురువారం ఆలూరులోని రాధాస్వామి ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పంట చేతికొచ్చే వరకు సంబంధిత బిల్లులు, విత్తన ప్యాకెట్లు, పురుగు మందుల డబ్బాలు, ప్యాకెట్లు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు, మందులను అధిక రేట్లకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. షాపుల్లో స్టాక్ బోర్డులు, విత్తనాలు, పురుగుల మందులు, ఫర్టిలైజర్స్ వారీగా రేట్ల పట్టికను ప్రదర్శించాలన్నారు. అనంతరం షాపులో రికార్డులను పరిశీలించారు. ఆలూరు ఏడీఏ సునీత, మండల ఏఓ వెంకటేశ్వర గౌడ్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

కౌతాళం: మండల పరిధిలోని మేళిగనూరు గ్రామంలో గతేడాది రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బాధిత కుటుంబానికి రూ.7లక్షల ఆర్థిక సాయం అందింది. దీంతో ఆ కుటుంబం గురువారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలిసి పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని, మేళిగనూరుకు చెందిన జగదీష్ ఆత్మహత్య చేసుకోవడంతో అతని భార్య లక్ష్మి ఖాతాకు రూ.7 లక్షల నగదు జమ చేసినట్లు తెలిపారు. భర్త మృతితో ముగ్గురు పిల్లలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు సాయం అందించడం పట్ల లక్ష్మి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మొత్తం తన పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పింది. నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్, గ్రామ నాయకుడు రామన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలో టిడ్కో లబ్ధిదారులకు ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్ రెడ్డి గురువారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 26వ వార్డుకు చెందిన 30 మంది మహిళలకు టిడ్కో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.500 చెల్లించిన లబ్ధిదారులకు ఉచితంగా టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు పత్రాలను ఇవ్వడం ఘన చరిత్ర అని కొనియాడారు. గతంలో చంద్రబాబునాయుడు కట్టించిన టిడ్కో ఇళ్లు మధ్యలోనే ఆగిపోయాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తామన్న మాట మేరకు నేడు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో 4720 ఇళ్లను నిర్మించడం జరిగిందని, అందులో 2 వేల ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జున, పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు నెట్టేకల్, రామంజి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రాలయం: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి సమస్యలను ఆరా తీశారు. ప్రజలు లేవనెత్తిన సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభావతి, ఏపీఓ తిమ్మారెడ్డి, ఏఓ జీరాగణేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న నాయకులు

సమాన వాటా కోసమే సంతకాల సేకరణ

ఆదోని టౌన్: అన్ని రంగాల్లో వెనకబడిన రాయలసీమకు సమన్యాయం కోసమే ఆర్‌సీసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టినట్లు ఆ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం ఆదోని నియోజకవర్గంలోని పెద్దహరివాణం, సంతెకూడ్లూరు, బలదూర్, హొళగుంద మండలంలోని ఇంగళదహాల్, ఎండీహళ్లిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌సీసీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్, జిల్లా కార్యదర్శి మధు మాట్లాడారు. వేదావతి, తుంగభద్ర నదులు పారుతున్నా ఆదోనిలో మాత్రం చుక్కనీరు లేకుండా చేసిన పాలకుల దుర్నీతిని ఎండగట్టేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. సంతకాలను చేపట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రధాని నరేంద్రమోదీకి పంపుతామన్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లో ఏటా కూలీలు వలస వెళుతున్నారని, అయినా అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. నిత్యం కరువు, కాటకాలతో ఆదోని ప్రాంతం విలవిల్లాడుతుందన్నారు. వర్షాలు లేక పంటలు పండక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌డీఎస్ కుడి కాలువ, వేదావతి, గుండ్రేవుల, మేళిగనూరు వరద కాలువలను నిర్మించి, కరువు కాటకాలను నివారించాలని కోరారు. నాయకులు రవివర్మ, శాంతరాజు, వేమారెడ్డి, మోహన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని మండగిరి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు అధికారులతో కలిసి పరిశీలించారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. ప్రస్తుతం 5,100 ఇళ్లకు పునాదులు వేయడం జరిగిందని, 2 వేల ఇళ్ల వరకు బేస్‌మెంట్ లెవెల్‌లో పనులు జరుగుతున్నాయన్నారు. వంద ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి నాణ్యతగా పనులు జరిగేలా చూసుకోవాలన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహా

ఆదోని అర్బన్: పట్టణంలోని జామియా మసీదు వెనకాల మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు మట్కా బీటర్లను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహా గురువారం విలేకరులకు తెలిపారు. చందాసాహెబ్ దర్గా వద్ద నివాసం ఉండే ఇస్మాయిల్, చౌకీమఠం నివాసి కన్నయ్య, బంజులమ్మ గుడి వద్ద నివాసముంటున్న శ్రీనివాసులు మట్కా చీటీలు, నాటుసారా కలిగి ఉండడంతో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారు మట్కా ఆడేందుకు సిద్ధం చేసుకున్న రూ.1,20,000 నగదు, 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మట్కా డబ్బులను వీరి నుంచి సేకరించే ఎస్కేడీ కాలనీకి చెందిన ఇక్బాల్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఎవరైనా మట్కా, పేకాట, కర్ణాటక మద్యం రవాణా, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటికి పాల్పడితే 91211 01135 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సిబ్బంది రంగస్వామి, హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి, సుధీర్, మధు, వెంకటేష్, ముస్తాక్‌లు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి నిందితులు



నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

ఆదోని అర్బన్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని త్రీటౌన్ పోలీసులు ఐదు రోజులక్రితం అరెస్టు చేసి రూ.80 లక్షలు నగదు, కారు, బైకులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఆ నిందితులను గురువారం జైలు నుంచి విచారణ నిమిత్తం పోలీసులు కస్టడీకి తీసుకున్నట్లు సీఐ నరసింహరాజు, ఎస్ఐ పీరయ్య విలేకరులకు తెలిపారు. వీరి వెనక ఎవరెవరు ఉన్నారు. ఎక్కడెక్కడ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు, ఎవరితో ఆడిస్తున్నారు, అనే విషయాలు తెలుసుకునేందుకు రెండు రోజులపాటు విచారణ చేయనున్నట్లు తెలిపారు. ఆదోనిలోని మరాఠీ వీధికి చెందిన మహానంది, పింజరి వీధికి చెందిన హుసేన్ అలియాస్ చిద్దు, రాజరాజేశ్వరినగర్‌కు చెందిన మహ్మద్, తెలంగాణ రాష్ట్రం ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారిలను కస్టడీకి కోరుతూ కోర్టులో పోలీసులు విన్నవించగా జడ్జి అనుమతించినట్లు చెప్పారు. మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని రంగంలోకి దించినట్లు తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ఆదోని రూరల్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తుగా జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల కోసం బ్యా నర్లు కట్టుకొని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అడ్మిషన్ల కోసం సెలవు దినాల్లో ఉపాధ్యాయులతో పని చేయించుకోవడం దారుణమన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రంగస్వామి, ఆది, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనల బ్యానర్లు తొలగింపు

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ప్రకటనల బ్యానర్లను గురువారం ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు తొలగించి భీమాస్ సర్కిల్ వద్ద వాటిని తగలబెట్టారు.అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కాయన్నారు. ప్రధాన కూడళ్లలో, రోడ్ల పక్కన విద్యా సంస్థల బ్యానర్లను కట్టి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ ఉపాధ్యక్షుడు యు.వీరేష్, నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి శివకుమార్, పీడీఎస్‌యూ నాయకులు అభిమిత్ర, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న ఆర్జీటీ సెట్

కోసిగి: పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించి ఆర్జీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29వ తేదీన ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆ సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీటీ కోసిగి ఏరియా పరిధిలోని కోసిగి, మంత్రాలయం, కౌతాళం మండలాల నుంచి ఆర్జీటీ సెట్ కోసం 54 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారికి నేటి నుంచి హాల్ టికెట్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఆర్జీటీ సెట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తుందని తెలిపారు.

22న కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

ఆదోని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఈనెల 22వ తేదీన నిర్వహించ తలపెట్టిన కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కూలీలను కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని జాలిమంచి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో నిధులు కోత పెట్టిందని విమర్శించారు. మస్టర్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని, రెండు పూటల పనిని రద్దు చేయాలన్నారు.

కోసిగి: ఈనెల 22న కర్నూలు కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో కోసిగి మండల ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు రాముడు, వీరేష్‌లు కోరారు. గురువారం కోసిగి మండలంలోని డి.బెళగల్ గ్రామంలో పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణకు కదిలిరావాలని పిలుపునిచ్చారు.

లాడ్జీల నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం

ఆదోని అర్బన్: పట్టణంలోని లాడ్జీల నిర్వాహకులతో గురువారం డీఎస్పీ శివనారాయణస్వామి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లాడ్జీకి వచ్చే వారి పక్కా అడ్రస్ తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు, మట్కా, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, వ్యభిచారం లాంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. పట్టుబడితే లాడ్జీల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.